
క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



దత్తాత్రేయస్వామి

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సుమన్

పగిడ్యాల:జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమం కింద మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో గురువారం పశువైద్యాధికారి డాక్టర్ సుమన్ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.ఈ వ్యాధి సోకిన పశువుల్లో వ్యాధి నిరోధక సామర్థ్యం తగ్గి పోతుందని, దూడలలో మరణం సంభవించే అవకాశం ఉందని చెప్పారు. నియంత్రించడానికి పాడి రైతులకు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ నెల 31 వరకు టీకా కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సిరాజుద్దీన్

మిడుతూరు: ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్త చేసుకోవాలని తహసీల్దార్ సిరాజుద్దీన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పైపాలెం గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణాల్లో జాప్యం తగదని, ఉగాది పర్వదినం నాటికి పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణం పూర్తయితేనే స్థలం, ఇంటిపైన సంపూర్ణహక్కులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమేష్, ఇంజినీర్ అసిస్టెంట్ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలదేవస్థానం అభివృద్ధికి సహకరిస్తాం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం అభివృద్ధికి తమవంతు సహకరిస్తామని వాసవిసత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈఓ లవన్న ఆధ్వర్యంలో దేవస్థానం అభివృద్ధి కోసం దేవస్థానం ఎదుట ఉన్న దుకాణాలను తొలగించారని, ఇందులోభాగంగా వాసవి సత్రం కూడా కొద్ది భాగం స్వచ్ఛందంగా తీసివేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాని దీనికి ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఈవిషయం కొన్ని సామాజిక మాధ్యమాల్లో వేరే విధంగా పోస్టులు వస్తున్నాయని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని విజ్ఞప్తి చేశారు.

శాంతి కోసం పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న విద్యార్థులు


నందికొట్కూరు: గ్రామ శాంతిని కాంక్షిస్తూ గురువారం మండల పరిధిలోని దామగట్ల గ్రామం నుంచి నందికొట్కూరు వేళాంగిణి ఆలయం వరకు 5 కిలో మీటర్లు విద్యార్థులు పాదయాత్ర చేశారు. రాబోయే కాలంలో దేశం, రాష్ట్రంతోపాటు తమ గ్రామానికి, తమ కుటుంబాలకు ఎలాంటి కీడు రాకుండా ఉండాలని దేవున్ని ప్రార్థిస్తూ విద్యార్థులు ఈస్టర్ ఉపవాసంతో పాదయాత్ర చేసినట్లు దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల జ్యోతి తెలిపారు. అదేవిధంగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగనన్న రాబోయే ఎన్నికల్లో కూడా సీఎం కావాలని దేవున్ని ప్రార్థించినట్లు చెప్పారు.

అన్ని రంగాల్లో రాణించాలి

పాములపాడు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ కాంతి పథం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. సమాజ శ్రేయస్సులో మహిళలది ప్రత్యేక పాత్ర అన్నారు. ప్రధానంగా పిల్లలను మంచిగా చదివించి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. అనంతరం వైకేపీ సిబ్బంది తహసీల్దార్, ఎంపీడీఓ సుమిత్రమ్మలను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ పుల్లయ్య, ఏపీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు నూతన శోభ

- అందుబాటులో కొత్త పుస్తకాలు
- పోటీ పరీక్షల అభ్యర్థులకు బాసటగా చర్యలు



నందికొట్కూరు గ్రంథాలయంలోని పుస్తకాలు

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రంథాలయాలను బలోపేతం చేసింది. అధునాతన సౌకర్యాలతో విజ్ఞాన భాండాగారాలను తీర్చిదిద్దుతోంది. ఊరూరా డిజిటల్ లైబ్రరీలను నిర్మిస్తుండటంతోపాటు ఉన్న గ్రంథాలయాలకు కొత్త భవనాలు, మరమ్మతులు చేపట్టింది. అదేవిధంగా విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన నూతన పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచింది. కొత్త పుస్తకాలు రావడంతో పాఠకులతో గ్రంథాలయాలు కళకళలాడుతున్నాయి.

రూ.34 లక్షలతో పుస్తకాల కొనుగోలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 76 గ్రంథాలయాలు ఉన్నాయి. ఇందులో 25 లైబ్రరీలకు సొంత భవనాలు ఉండగా, అద్దె భవనాల్లో 23 ఉన్నాయి. 20 నూతన భవనాలు మంజూరు కాగా అందులో పది భవనాల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన పది భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 16 లైబ్రరీలకు దాతలు ఉచితంగా భవనాలు ఇచ్చారు. కొత్తపల్లి మండల కేంద్రంలోని గ్రంథాలయ నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించారు. జిల్లాలో గ్రంథాలయాల్లో సభ్యత్వం ఉన్నవారు 72,052 మంది ఉన్నారు. విద్యార్థులు, అభ్యర్థులకు మేలు చేస్తూ ఇటీవల పోటీ పరీక్షలకు సంబంధించి కొత్త సిలబస్‌కు తగ్గట్టుగా పుస్తకాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. జిల్లాలో రూ.34 లక్షలతో 30 వేల పుస్తకాలను కొనుగోలు చేయగా వీటిలో 25 శాతం పోటీ పరీక్షలకు ఉపయోగపడేవి ఉండటంతో యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాల కొనుగోలు శుభపరిణామం

నేను ఆత్మకూరు పట్టణంలో డిగ్రీ చదువుతున్నాను. లైబ్రరీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన భవనాలు మంజూరు చేయడం హర్షణీయం. అదేవిధంగా నిరుద్యోగ యువత కోసం కొత్త పుస్తకాలు కొనుగోలు చేయడం శుభపరిణామం.

–తలారి కిరణ్, జీ.వీరాపురం

నిర్మాణాలు వేగవంతం చేశాం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రంథాలయాలకు నూతన భవనాలు నిర్మిస్తోంది. ఇప్పటికే కొన్ని భవన నిర్మాణాలు పూర్తి కాగా మిగిలిన నిర్మాణాలను వేగవంతం చేశాం. అదేవిధంగా కొత్తగా పుస్తకాలు కొనుగోలు చేసిన గ్రంథాలయాలకు పంపిణీ చేశారు.

–ప్రకాష్, గ్రంథాలయ శాఖ జిల్లా కార్యదర్శి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో కేసీ కాలువ గట్టు మీద ఆంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. పురోహితుల సాంప్రదాయ వేద మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహ వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఘనంగా గంధం మహోత్సవం

పాములపాడు:మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మస్తాన్ వలి ఉరుసు మహోత్సవంలో భాగంగా గురువారం గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. దర్గా ముజావర్ బాదర్ల సాహెబ్ ఇంటి నుంచి గంధం బయల్దేరి గ్రామంలో బాణా సంచా, మేళ తాళాలతో ఊరేగింపుగా దర్గా వద్దకు చేరుకుంది. రాత్రంతా ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంతో భక్తులు నిర్వహించారు. తెల్లవారు జామున దర్గాలో స్వామి వారి వద్ద ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి భక్త సమూహంతో గంధం ఎక్కించారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

పగిడ్యాల: 2021–22 ఆర్థిక సంవత్సరంలో మండ ల వ్యాప్తంగా 8 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉ పాధి హామీ పనులపై 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం శుక్రవారం నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఏపీఓ మద్దిలేటి తెలిపారు.ఉపాధి కూలీల వేతనాల ఖర్చు కింద రూ.2.73 కోట్లు,మెటీరియల్ ఖర్చు కింద రూ.4.25 లక్షలు, పంచాయతీ రాజ్ పనుల్లో కూలీలకు చెల్లించిన రూ.1.55లక్షలు, మెటీరియల్ ఖర్చు కింద రూ.2కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. దాదాపు రూ.4.88 కోట్లు 2021–22 సంవత్సరంలో ఖర్చు చేశామని, ఈ పనుల పై సామాజిక తనిఖీ బృందం విచారణ నిర్వహించిందన్నారు.వీటిపై నంద్యాలలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహానందిలో పెళ్లి సందడి

మహానంది: మహానందిలో గురువారం పెళ్లిసందడి నెలకొంది. శుభ ముహూర్తాలు ఉండటంతో సుమారు పది పెళ్లిళ్ల వరకు జరిగాయి. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి కుమారుడి వివాహానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి(నాని)లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆహార నియమాలు పాటించాలి

నందికొట్కూరు: ప్రతి ఒక్కరూ తమ రోగనిరోధక శక్తి పెంచుకునేందుకు ఆహార నియమాలు పాటించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ నేచురోపతి సంస్థ పుణే వారి సహకారంతో నేచురోపతి ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తోపాటు డాక్టరు మురళీధర్‌రెడ్డి సహజ సిద్ధమైన ఆహారం, పండ్లు, కూరగాయలు తీసుకోవడంతోపాటు వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఖాజాహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉరుసు వేడుకలు



పూజలందుకున్న జమాలయ్యస్వామి

మహానంది: తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల సమీపంలో ఉన్న జమాలయ్యస్వామి దర్గా, గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న జంగిల్ పీర్ సాహెబ్ దర్గాల్లో గురువారం ఉరుసు వేడుకలు వైభవంగా జరిగాయి. ఆయాగ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో దర్గా వద్దకు చేరుకుని సంప్రదాయపరంగా పూజలు చేపట్టారు. ఉరుసు సందర్భంగా దర్గాల ఆవరణలో అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం జమాలయ్య స్వామి దర్గా వద్ద కోలాటం ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

పగిడ్యాల: ఈ నెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై ఎంపీడీఓ వెంకటరమణ పట్టభద్రులకు అవగాహన కల్పించారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పట్టభద్రుల ఓటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఓటింగ్ హాల్‌లో ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పేపర్లో పోటీ చేసిన అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయని, పార్టీల గుర్తులు ఉండవన్నారు. ఓటు ఎవ్వరికి వేయాలో ఆ అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉండే బాక్స్‌లో పెన్నుతో ప్రాధాన్యత క్రమంలో అంకెలు వేయాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్లు తప్పనిసరిగా ఓటరు స్లిప్‌లు, గుర్తింపుకోసం ఆధార్, పాన్, ఓటరు కార్డు వంటివి వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ జి.సుభద్రమ్మ, ఆర్ఐ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

కొత్తపల్లి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు పూర్తిచేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ గురువారం తెలిపారు. మండలంలో మొదట ఒకే చోట ఎన్నికల పోలింగ్ కేంద్రం ఉండేదని, అయితే మండల కేంద్రానికి, గ్రామాలకు మధ్య దూరం పెరగడంతో మూడు చోట్ల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 315 పోలింగ్ కేంద్రం(పట్టభద్రులకు), ఉపాధ్యాయులకు 168 పోలింగ్ కేంద్రం, ముసలిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 315–ఎ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఒక్క ఓటు కూడా పక్కకు పోరాదు





ప్రసంగిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, హాజరైన ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, గ్రాడ్యుయేట్లు

- రాష్ట్రంలోనే అధిక మెజార్టీ నందికొట్కూరుకే దక్కాలి
- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి
- నియోజకవర్గ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లతో సమావేశం
- హాజరైన వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, అభ్యర్థులు డాక్టర్ మధుసూదన్, వెన్నపూస రవీంద్రారెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): శాసన మండలి ఎన్నికల్లో మన ఓట్లు ఒక్కటి కూడా పక్కకి పోరాదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయ కర్త, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి అన్నారు. మండలి ఎన్నికల నేపథ్యంలో గురువారం స్థానిక కార్యాలయంలో నందికొట్కూరు నియోజకవర్గం ఎంపీపీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి ఎన్నికలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కీలకంగా తీసుకున్నారని చెప్పారు. తన పరిధిలోని ఒక్క ఓటు కూడా మిస్ కాదని తనకు తెలుసని, అయితే నిర్ణీత సమయంలోపు ఓటు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేసి నందికొట్కూరుకు మెజారిటీ రాష్ట్రంలోనే అధికంగా దక్కేలా చూడాలన్నారు. స్థానిక సంస్థల అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌ది తమ నియోజకవర్గం కావడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు మనవే కావాలని, ఈ గెలుపుతో మరో సారి మన సత్తా చాటుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మండలి ఎన్నికల్లో మన ఓట్లు వేసుకోవడంతో పాటు తోటి ఓటర్లను ప్రలోభాలకు గురి కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. సాధారణ గెలుపు కంటే భారీ మెజారిటీ దక్కేలా అనుసరించాలని సూచించారు. సమష్టిగా కృషి చేస్తేనే ఇది సాధ్యమవుతుందని వెల్లడించారు. నందికొట్కూరుపై ప్రభుత్వానికి ప్రత్యేక అభిమానం ఉందని, దీనిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం మండలి అభ్యర్థులు డాక్టర్ ఎ.మధుసూదన్ (స్థానిక సంస్థలు), వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రులు) మాట్లాడుతూ గొప్ప ఆశయాలతో సీఎం జగన్ ముందుకు వెళ్తున్నారని, తమను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ఆయన లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో తమను గెలిపిస్తే మండలిలో స్థానిక సమస్యలు, పట్టభద్రుల సమస్యలపై మాట్లాడుతామని తెలిపారు. సమావేశంలో నందికొట్కూరు నియోజకవర్గ జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, సోములు, సుధాకర్, జగతి రెడ్డి, దివ్య, ఎంపీపీలు మురళీకృష్ణారెడ్డి, మండ్ల మల్లేశ్వరి, సువర్ణమ్మ, కుసుమలత, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రశాంతి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీలు పాల్గొ
న్నారు.

పెట్రోల్ బంక్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో నూతన పెట్రోల్ బంక్ నిర్మాణానికి గురువారం సాయంత్రం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి భూమిపూజ చేశారు.జలవనరుల శాఖ సెంట్రల్‌వర్క్‌షాపు లోపల భాగంలో 150 అడుగుల పొడవు, 150 అడుగుల వెడల్పు స్థలాన్ని రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో పెట్రోల్ బంక్ లేకపోవడంతో స్థానికులు, శ్రీశైలంకు వచ్చే యాత్రికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎట్టకేలకు పెట్రోల్‌బంక్ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు రావడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం మండలంలో ఎన్నో ఏళ్లుగా తిష్టవేసిన సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతున్నామన్నారు. సున్నిపెంట కాలనీ ప్రజలకు శాశ్వత మంచినీటి పథకం పనులు దాదాపు పూర్తి చేశామని, త్వరలోనే నిత్యం త్రాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెట్రోల్‌బంక్ నిర్మాణానికి కూడా అవసరమైన భూమిని ప్రభుత్వం కేటాయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యుత్ సమస్యను ఏపీఎస్‌పీడీసీఎల్‌కు అప్పగించడంతో పాటు నూతన సబ్‌స్టేషన్‌ను నిర్మించి కరెంట్ కోతలకు లేకుండా చేశామన్నారు. త్వరలోనే గ్రామపంచాయతీ పరిపాలన రూపుదిద్దుకోబోతుందని, జలవనరుల శాఖ పరిధిలోని సున్నిపెంట గ్రామాన్ని పంచాయతీరాజ్ శాఖకు అప్పగించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. భూమిపూజ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎంఏ రజాక్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ఆసాదిప్రవీణ్, దివ్యతేజ, జలవనరుల శాఖ ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ గంగాధర రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఏఎస్ అన్వర్‌బాష, ఏఎస్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సిజేరియన్ ఆపరేషన్లు ప్రారంభం



ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం సిజేరియన్ ఆపరేషన్ల సేవలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ ఆపరేషన్లు ప్రారంభించాలని విన్నవించారన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఆపరేషన్లు ప్రారంభించినట్లు చెప్పారు. ఇందుకు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. పేద ప్రజల కోసం సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో వారంలో రెండు రోజులు సిజేరియన్ సేవల కోసం కేటాయిస్తున్నామన్నారు. అనంతరం వైద్యశాలలోని పరికరాలను, రికార్డులను తనిఖీ చేసి రోగులతో, బాలింతలు, గర్భవతులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటరమణ, మున్సిపల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వైద్యురాలు లక్ష్మీప్రసన్న, వైద్య సిబ్బంది రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు షాలుపైల్మాన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



పాములపాడు పోలింగ్‌కేంద్రం పరిశీలిస్తున్న సెక్టోరియల్ ఆఫీసర్ ఆంజనేయ

పాములపాడు: ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సెక్టోరియల్ ఆఫీసర్ ఆంజనేయ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై సూచనలిచ్చారు. ఓటు వినియోగించుకునేందుకు వచ్చే దివ్యాంగులు, మహిళలు, సీనియర్ సిటిజన్స్ కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటర్లు సెల్‌ఫోన్‌తో పోలింగ్‌కేంద్రం వద్దకు రాకూడదన్నారు. ఓటర్లు మినహా ఇతరులెవ్వరూ పోలింగ్ కేంద్రం దరిదాపుల్లో ఉండరాదని చెప్పారు. 13వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటలలోపు ఓటు వేసే సమయం ఉంటుందని వివరించారు.ఆయన వెంట తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుమిత్రమ్మ, హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ, ఎస్ఐ అశోక్, పీడీ దేవానంద్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులకు చర్యలు

నందికొట్కూరు: పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాట్లు చేస్తామని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను టౌన్ సీఐ విజయభాస్కర్ పరిశీలించారు.

ఆదిలక్ష్మికి బెస్ట్ టీచర్ అవార్డు



ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మీని సన్మానించిన ఉపాధ్యాయులు

మహానంది: బసవాపురంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఎస్‌జీటీ ఆదిలక్ష్మికి మహిళా దినోత్సవం సందర్భంగా బెస్ట్ టీచర్ అవార్డు అందించారు. నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జేసీ నిశాంతి తదితరులు గురువారం సర్టిఫికెట్, మెమొంటో అందించారు. ఈ మేరకు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులతో పాటు చైర్మన్ షేక్ తగ్గీర్, లావణ్య తదితరులు ఆమెను అభినందించారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేశాం

జూపాడుబంగ్లా: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేసినట్లు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. గురువారం ఆయనవిలేకరులతో మాట్లాడుతూ..మండలం వ్యాప్తంగా 945మంది పట్టభద్రులు, 48మంది టీచర్ల ఓటర్లు ఉన్నారని తెలిపారు. వారందరికీ ఓటరు స్లిప్పులను వీఆర్ఏల ద్వారా పంపిణీ చేయించినట్లు తెలిపారు. ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు జూపాడుబంగ్లా మోడల్ పాఠశాలలో పట్టభద్రులకు, టీచర్లకు వేర్వేరుగా రెండు పోలింగ్ బూతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

గర్భిణుల ఆకలి తీర్చడంలో ఎంతో తృప్తి

నందికొట్కూరు: వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణుల ఆకలి తీర్చడం ఎంతో తృప్తినిస్తుందని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, డాక్టర్ ఏఎస్ రాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో తహసీల్దార్ ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నం వడ్డించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి నెల 9న వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భవతులకు దాతలు బలమైన ఆహారం అందించి గొప్ప మనస్సు చాటుతున్నారన్నారు. జవ్వాజి సుంకన్న సేవా సమితి సభ్యుల కృషి మరవలేనిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాయక్, జవ్వాజి సుంకన్నగౌడు సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడు పాల్గొన్నారు.